

# పైతరగతి

వి. రాజారామమోహనరావు

చిన్నప్పట్నుంచీ సునీతకి కొంచెం చిరాకు ఎక్కువ. ఆ విషయం సునీతకీ తెలుసు. తెలిసినా, స్నేహితులు దగ్గర వాళ్ళు చాలామంది చెప్పినా ఎన్నో ఏళ్ళుగా ఆ చిరాకుని తగ్గించుకోలేక పోయింది.

ట్రాన్స్‌ఫర్ మీద హైద్రాబాదు సునీత వొచ్చి పదిహేనురోజులు పైనే అయింది. కొత్తచోటుని, కొత్త వాతావరణాన్ని తట్టుకుని పడాల్సిన పాట్లన్నీ వొక్కతే పడింది. మిగిలిన వాటన్నింటి కన్నా పదిరెట్లు యిబ్బంది సునీతకి యిల్లు వెతుక్కోటంలో ఎదురైంది.

చిన్నరూము, వంటిల్లువున్న పోర్షన్ అయితే చాలు. అద్దె నూటయాభై కన్నా ఎక్కువ ఇవ్వలేదు. యీ విషయాన్ని మననం చేసుకుంటూ యిళ్ళవేట సాగించింది.

ఖాళీగావున్న యిళ్ళు కనపట్టమే గగనం అయింది. కనపించిన యిళ్ళల్లో అందరూ కామన్‌గా చేసిన రిమార్క్ వొక్కటే. పోర్షన్ అంతట్లోనూ సునీత వొంటరిగా వుంటానంటం.

'తన్తోతేనా ఎవరూ రారా..' అని ఒకళ్ళు .... 'పోనీ ఎవరేనా స్నేహితురాల్ని కజ షకుని కలిసి వుండొచ్చుగా.' అని వొకళ్ళు, రకరకాల సలహాలు యిచ్చారు. కొంతమంది సూటిగానే అడిగారు ... 'ఒంటరిగా వుండాలనుకోటంలో మీ వుద్దేశం ఏమిటని....'

అందరి విషయంలోనూ సునీతకి చిరాకే కలిగింది. అయినా ఎంతగానో

తమాయించుకుంది. "నేను ఒంటరి గానే వుంటాను. అది నా అలవాటు .... మీ యింట్లో దిగాక ఎప్పుడు మీకు నా ప్రవర్తన యిబ్బంది కలిగిస్తే అప్పుడు చెప్పండి .... యిల్లు ఖాళీ చేసేస్తాను. అంతేకానీ యిప్పుడు యీ ప్రశ్నలన్నీ వేయకండి" అంది రెండు మూడు చోట్ల. వాళ్లు ఆ తర్వాత సునీతని ఏం ప్రశ్నించలేదు. కానీ యిల్లు కూడా యివ్వలేదు 'నిగమంతం .... మళ్ళీ ఖాళీ చెయ్యమంటం. ఎందుకొచ్చిన తలకాయ నొప్పిలే ' అనుకున్నారు మనసులో ....

అయినా సునీత తనపట్టు వొదల్లేదు. చివరికి ఊరికి దూరంగా వున్న కాలనీలో, కొత్తగా కట్టిన యింట్లో, మూటపాతికలో గది వంటిల్లు వున్న పోర్షన్ దొరికింది సునీతకి.

రెండునెలలు ఎడ్వాన్సిచ్చి అందులోకి ప్రవేశించి "అమ్మయ్య...." అనుకుంది సునీత. ఆ తర్వాత ఏర్పాట్లు యిదివరకు చేసుకున్నట్టే చేసుకుంది. ఇదివరకంటే హైద్రాబాద్ రాకముందు విజయవాడలో, అంతకన్నా ముందు బందరులో....పనిచేసినప్పుడు చేసుకున్న ఎరేంజ్‌మెంట్స్....

పనిమనిషి, పాలుతెచ్చే కుర్రాడు, చాకలీ యిలాంటివన్నీ మామూలే యివి కాక పొద్దున్నే న్యూస్‌పేపరు యింటికి వొచ్చే ఏర్పాటు, వార, మాసపత్రికలు, ప్రతి ఆదివారం, యితర శెలవరోజుల్లో సినిమా.... యిదీ యిన్నేళ్లుగా అలవాటు చేసుకున్న జీవితం.

కొద్ది నెలల్లోనే ముప్పయి ఏళ్ళు రాబోతున్న సునీతకి యీ అలవాట్లు, గిరిగీసుకున్న యీ ఒంటరి జీవితం అస్తమానం చిరాకు కలిగిస్తూనే వున్నాయి. భరించటం మినహా ఏం చెయ్యాలో అర్థంకాని అయోమయంలో వుంది

తనకొచ్చే ఏడువందల జీతంలోనూ ప్రతినెలా మూడొందలు, ఏలూరులో సొంతయింట్లో వుండి చిన్న కూతుర్ని చదివిస్తున్న తల్లికి పంపిస్తుంది. మిగిలిన నాలుగువందలు వొక్కసారి పూర్తిగా ఖర్చవుతాయి.

ఇదివరకటి వూళ్ళకి, హైద్రాబాదు జీవితానికి సునీత కార్యక్రమంలో వొచ్చిన మార్పు వొకటుంది. ఇదివరకు ప్రతి ఆదివారం, శెలవరోజు సినిమా చూసేది. ఇక్కడికి కొచ్చాక అవి తగ్గించేసింది. దానికి కారణం వూరు చివరున్న ఆ కాలనీనుంచి సినిమాకివెళ్ళి రావడానికి మొత్తం ఆ రోజంతా సరిపోతుంది. ఆటోలు, టాక్సీలు ఎక్కి సౌఖ్యంగా తిరిగేంత వీలు ఆర్థికంగా సునీతకి లేదు. బస్సులెక్కి క్యూలలో యాతనపడి సినిమా చూసి తిరిగివచ్చేటప్పటి శెలవరోజంతా అయిపోయి కాస్సేపైనా రెస్టుతీసుకోటానికి వుండటం లేదు.

శెలవనాడు పుస్తకాలు, పత్రికలు వోపికున్నంతసేపు చదవటం, మిగిలిన సమయం కిటికీలోంచి బైటకి చూస్తూ గడపటం. పక్క పోర్షన్ యింటివాళ్ళే వుంచుకున్నారు. వాళ్ళు కాపరం వుండటానికి కాదు, సామానుకోసం. దగ్గర్లో యిళ్ళులేవు .... ఎదురిల్లు తప్ప.... ఆ ఎదురిల్లు మాత్రం మంచి కాలక్షేపంగానే వుంది సునీతకి.

ఎదురింటావిడ సునీతకి తెలుసు. చాలాసార్లు చూసింది. కనిపించినప్పుడల్లా ఆవిడ పలకరింపుగా నవ్వుతుంది. బదులుగా సునీత నవ్వటం తప్ప యిద్దరి మధ్య మాటలెప్పుడూ జరగలేదు.

ఆవిడ మంచి స్టైలిష్‌గా వుండటమే కాదు, ఎప్పుడూ మంచి హడావిడిగా కూడా వుండేది. అందుకే సునీత చొరవ చేసి పలకరించలేకపోయింది. ఆవిడ ఎక్కడ పనిచేస్తుందో, ఆవిడ వ్యాపకం ఏమిటో తెలియకపోయినా ఆవిడ యింటికి వచ్చే విజిటర్స్‌ని చూసి ఆశ్చర్యపోయింది సునీత. కార్లు, స్కూటర్లు, ఆటోలు యిలా ఆ ఎదురింటికి వచ్చిపోయే వాహనాలకి అంతు లేదు.

ఆ యింటిని, ఎదురింటావిడ్ని చూస్తుంటే సునీతకి కొత్తలో సరదాగానే వుండేది కానీ, రానురాను చిరాకు కలగటం మొదలెట్టింది.

చాలావరకు ఆ చిరాకు తన వొంటరితనంమీదని సునీతకి తెలుసు. ఎవరేనా స్నేహితురాల్నో, తనతోపాటు పని చేస్తున్న ఏవొంటరి అమ్మాయినో వొచ్చి తనతో వుండమనొచ్చు. బందరులో వుండగా ఒకటి రెండు అలాంటి ప్రయత్నాలు చేసింది కూడా. చేసి నానా యాతనా పడింది. ఉన్నవాళ్ళు సవ్యంగా వుండేవాళ్ళు కాదు. యింటిని అల్లకల్లోలం చేసేవాళ్ళు. పక్కలెక్కి తొక్కడం, అన్ని వస్తువుల్ని వుమ్మడిగా వాడేయటం .... యీ పద్ధతులు నచ్చేవి కావు సునీతకి. అదీకాక వాళ్ళల్లో కొందరికోసం వచ్చే మొగస్నేహితులు, వాళ్ళ వెకిలివేషాలు .... అవేవీ భరించలేకే యిలా ఒంటరిగా ఒక్కత్తీ వుండటం అలవాటు చేసుకుంది.

ఆ రోజు పొద్దున్నించీ యింట్లోనే వుంది సునీత. ఒంటరితనం కలిగిస్తున్న చిరాకు, ఏమీ తోచక చిరాకు....తిక్క తిక్కగా వుంది. 'అసలు నాకింత చిరాకేమిటో ....' అనుకుంది సునీత.

ఇప్పుడే కాదు చిన్నతనంలో కూడా చాలాసార్లు ఆలోచించింది యీ విషయం గురించి.

'నువ్వు అస్తమానం చిరాగ్గా అలా ముఖంపెడుతుంటే నుదిటిమీద ముడతలు పడి, అంత చక్కటి ముఖమూ ఛండాలంగా వుంటోంది....' అని చాలామంది హెచ్చరించారు.

ఎవరికేనా సరే కోరుకున్నవి కోరుకున్నట్టు జరగకపోయినా, అయిష్టమైనవి జరిగినా సాధారణంగా చిరాకు వస్తుంది. ఇదే నమ్మకం సునీతకి వుంది. దీనితో జీవితంలో తను కోరుకున్నట్టు ఏదీ జరగలేదన్న నమ్మకం కూడా వుంది. తనలో యింతటి చిరాక్కి మూలకారణం అదేనన్న అభిప్రాయం సునీతకి.

కొంచెం తీరుబడిగా వున్నప్పుడల్లా, తనకి జీవితంలో అయిష్టమైనవి ఏమేం జరిగాయో, కోరుకున్నవి ఏం జరగలేదో గుర్తుతెచ్చుకోటం అలవాటైంది. అలాంటప్పుడు తరచుగా సునీతకి గుర్తు వచ్చేవి కొన్ని వున్నాయి.

చిన్నతనంలో ఎప్పుడు సినిమాకి తీసికెళ్ళినా తల్లి తనని, చెల్లెల్ని నేలకే తీసికెళ్ళేది. కొంచం జ్ఞానం తెలిసిందగ్గర్నించీ సునీతకి పై క్లాసులో కూచుని, దర్జాగా చూడాలని మనసు తల్లి దగ్గర చాలా సార్లు పేచీకూడా పెట్టింది. సినిమాహాలు దగ్గరికి వెళ్ళేవరకు సునీత కోరికని వొప్పుకున్నట్టే వొప్పుకుని తీరా చివరి నిముషంలో... "ఎందుకమ్మా డబ్బు దండగ .... నేల టిక్కెట్లు దొరుకుతున్నాయి .... యీసారి రష్‌గా వున్న సినిమాకి వెళ్ళినప్పుడు పై క్లాసుకి తీసికెళదాం గా...." అనేది. ఆవిడ సునీత నెప్పుడూ రష్‌గావున్న సినిమాకి తీసికెళ్ళనే లేదు. మధ్యతరగతి ఆడపడుచుగా పొదుపు తప్ప ఆవిడకి మరో దృష్టి వుండేదికాదు.

ఇలాంటి అనుభవమే సునీతకి జీవితంలో తరవాతా ఎదురైంది. కానీ అప్పుడు సునీత చిన్నపిల్ల కాదు. అన్నీ తెలిసిన యుక్తవయసులో వుంది.


కాలేజీచదువు పూర్తయిన దగ్గర్నించి సునీతకి సంబంధాలు చూశారు. చాలా పెళ్ళిచూపులుకూడా జరిగాయి. పెళ్ళి చూపులకి ముందే ఎప్పుడో నిర్ణయించేసుకుంది సునీత. 'పెళ్ళి విషయంలో నా మనసుకి నచ్చినట్టే ప్రవర్తించాలి. ఎవరు ఏం చెప్పినా చస్తే పట్టించుకోకూడదు' అనుకుంది.

కన్నెమనసుని కంగారుపెట్టే చిత్రమైన తలంపులు, వూహాలు గుండెనిండా నింపుకుని మొదటిసారిగా పెళ్ళి చూపుల్లో అతన్ని చూసింది. అతను నచ్చాడు. ఎన్నెన్నో వూహించేసుకుంది సునీత. కానీ కట్నం విషయంలో కుదరక ఆ పెళ్ళి కుదరలేదు.

ఆ తర్వాత నుంచీ ముందు కట్నం విషయం వివరాలు అడిగి సంబంధాలు చూట్టం మొదలెట్టారు.

అవేవీ సునీతకి నచ్చలేదు. కట్నం మరింతగా యిస్తేనే కానీ సునీతకి నచ్చే సంబంధం రాదని తెలిసింది.'

"మగదిక్కు లేని సంసారం.... అన్ని సంబంధాలు నువ్విలా తిరక్కొడుతుంటే పెళ్ళి ఎలా అవుతుందే... నీ నెత్తి మీదకి ఎన్నేళ్ళు వచ్చాయో చూసుకున్నావా? కొంచెం అటోయిటో ఏదో




సంబంధం వొప్పుకో...." అంది తల్లి సునీతతో.

"పెళ్లి కాకపోతే వుద్యోగం చేసుకుని బతుకుతాను. అంతే కానీ నాకు పూర్తిగా నచ్చనివాణ్ణి నేను ఛస్తే చేసుకోను" అంది సునీత. సునీత దృష్టిలో ఏమున్నాయో సునీత తల్లికి తెలుసు. పెళ్లికొడుక్కి ఆఫీసరు హోదాలో వుద్యోగం, స్టైలుగా వుండే అందం, స్కూటరు.... యివేవీ సాధ్యపడేవి కావని తెలుసుకుని ఆవిడ మనసు రాయిచేసుకుంది.

చివరికి సునీతమాటే నిజమైంది. ఒంటరిగా వుద్యోగం చేసుకు బతకటమే సునీత బతుకైంది.

సాయంత్రం వరకూ అలాగే ఆలోచనల్తో వొంటరిగా గడిపిన సునీతకి మరింతగా చిరాకు పెరిగింది. సునీత మనసుని గతం ముల్లులా పొడవటం మొదలెట్టింది. ఆ రోజు గడిచినా, ఆ బాధ వొదల్లేదు సునీతని. ఏదో చెయ్యాలి. ఏదో అవ్వాలి అన్న తపన ఎక్కువైంది.

సరిగ్గా అలాంటి సమయంలోనే ఎదురింటి ఆవిడ ఆహ్వానం ద్వారా సునీత కళ్ళముందర కొత్త లోకం కదిలింది.

* * *

నెల గడిచేటప్పటికి ఎదురింటి ఆవిడతో కొద్దిగా మాటలు కలిశాయి. ఆవిడ పేరు ప్రమీల అని తెలియటమే కాక, ఆవిడకున్న హైసర్కిల్, ఆవిడ పరిచయాలు, ఆవిడ ఎటెండ్ అయ్యే పెద్ద పెద్ద పార్టీల విషయాలు కూడా తెలిశాయి సునీతకి.

వోరోజు ఆవిడే సునీతతో ....

"మంచి వయసులోవున్న అందమైన ఆడపిల్లవి. అందులో వుద్యోగం చేసుకుంటూ వొంటరిగా వుంటున్నదానివి. జామ్ జామ్ అంటూ వుండాలి కానీ.... యిలా జిడ్డుగా, నీరసంగా వుండట మేమిటి. ఓరోజు ఒక్కసారి నాతో రా.... నీకో కొత్త లోకాన్ని చూపిస్తా." ఆ తర్వాత కొన్ని పార్టీలగురించి, హై సర్కిల్‌లోని మగాళ్ళ ముద్దుముద్దు జోకుల గురించి చాలా చాలా చెప్పింది. చివరికి సునీతని వూరించింది.

మొత్తానికి వోరోజు సునీత తెగించింది. 'అవును ఎంత కాలం యిలా.... ధైర్యంగా ఏదో ఒకటి చెయ్యాలి జీవితంలో. ఆనందాన్ని ఆశించటంలోనూ, అందుకునే ప్రయత్నం చెయ్యటంలోనూ తప్పులేదు" అనుకుంది.

ఆ రోజు ఆదివారం. అనుకున్న ప్రకారం అందంగా అలంకరించుకుని ఎదురింటావిడతో బైలుదేరింది సునీత. తమ గురించి వొచ్చిన కారులో ఎక్కింం దగ్గర్నించీ, పార్టీ అయిపోయి తిరిగి యిల్లు చేరేవరకు అంతా కలలా జరిగింది సునీతకి.

ఎప్పుడూ వుంటున్న నీటిని వొదిలి ఒక్కక్షణం గాలిలో ఎగిరి తిరిగి నీరు చేరిన చేపపిల్లకి కలిగే థ్రిల్ లాంటిది కలిగింది సునీతకి. తనకి తెలియని జీవితం ఎంతుంది, తను అనుభవించాల్సినవి యింకా ఎన్ని వున్నాయి! అనుకుంది సునీత.

ఫుల్‌సూట్‌లో నిండుగా వున్న రాజేందర్ పార్టీ జరుగుతున్నంత సేపూ తన కూడా వుండటం గుర్తుతెచ్చుకునేటప్పటికి వొళ్ళంతా చిత్రంగా పులకరించి వేడెక్కింది ముప్పైఏళ్ళు దగ్గిరపడుతున్న కన్య సునీతకి.


పదిహేను రోజులు గడిచే లోపలే మరో రెండు అలాంటి కాస్ట్లీ పార్టీలకి వెళ్లింది సునీత ప్రమీలతో. చాలామందిని ఒకళ్ళకి ఒకళ్ళని పరిచయం చెయ్యటమే తన వృత్తిలా ప్రమీల అస్తమానం కొత్త కొత్త అమ్మాయిల్ని పార్టీలకి తీసుకురావటం సునీత దృష్టిలో పడింది. అయినా పెద్దగా పట్టించుకోలేదు.

సునీత వెళ్లిన ప్రతిపార్టీకి రాజేందర్ వచ్చాడు. ఆ కబురూ యీ కబురూ చెప్తూ కూడా తిరిగాడు. మూడోసారి పార్టీ అయ్యాక తన కారులోనే యింటి దగ్గర డ్రాప్‌చేశాడు సునీతని, ప్రమీలని. డ్రాప్‌చేస్తూ దారిలో మంచి బట్టలషాపులోకి వెళ్లి వో పేకట్ తీసుకొచ్చి సునీతకి యిచ్చాడు.

ఇచ్చి.... "మన కలయికకి గుర్తుగా బహుమానం. యింటికి వెళ్ళగానే కట్టుకుని చూసుకోవాలి" అన్నాడు.

సునీత తీసుకోటానికి సందేహిస్తుంటే ప్రమీలే అందుకుని సునీత చేతిలో పెట్టింది.

* * *



ఇంటికి రాగానే రాజేందర్ చెప్పినట్టు చీర తెల్లటి తన వొంటిమీద ఎంతో చీరతీసి కట్టుకుంది సునీత. ఎర్రటి ఆ అందంగా కావున్నట్టనిపించింది.

వొదల్లేక వొదల్లేక ఆ చీరని ఎన్నో రకాలుగా అద్దంలో చూసుకుంది. అలా చూసుకుంటుంటే రాజేందర్ గుర్తొచ్చాడు. 'ఎంత మంచివాడు.... తనని ఎంత లైక్‌చేస్తున్నాడు. ఎంత బావుంటాడు. అందం, డబ్బు, హుందా ఉన్నాయి. తామిద్దరు చేరువై, యిద్దరికీ పెళ్ళయి.... ప్రమీల ఎంత మంచిది!' పగ్గాలేకుండా సాగుతున్న సునీత ఆలోచనలు ఒక్కసారిగా ఆగిపోయాయి. చేతికి చీరమీద గరుగ్గా ఏదో తగిలింది.

అందమైన ఆ ఎర్రటిచీరని పిన్‌చేసి వున్న ఉత్తరాన్ని ఆత్రంగా చూసింది.

"డియర్ సునీ....

చీర బాగుంది కదూ. పై ఆదివారం ఎక్కడికీ వెళ్ళకు.... నేనే వస్తాను. నువ్వు వొంటరిగానే వుంటున్నావని.... ఏ యిబ్బందీ లేకుండా మీ యిల్లే బావుంటుందని ప్రమీల చెప్పింది. రియల్లీ వుయ్ కెన్ హేవ్ నైస్ సెక్సీ టైమ్...."

నీ రాజేందర్....

ఏమిటో ఆశించి ఆ వుత్తరం చదివిన సునీతని ఎక్కడలేని నీరసం కమ్ముకున్నట్టయింది. కళ్ళు తిరుగుతున్నట్టనిపిస్తే నెమ్మదిగా మంచంమీద కూలబడింది. అలా కూలబడ్డ సునీత చాలా సేపటివరకు లేవలేకపోయింది. ప్రమీల, రాజేందర్ కలిసి తనకి అందుబాటులోకి తీసుకొస్తున్న లోకమేమిటో, వాళ్ళు అందిస్తామంటున్న అనుభవం ఏమిటో స్పష్టంగా అర్థమైంది. అందుకోటమా మానటమా.... అని కాస్సేపు ఆలోచించింది.

అంతవరకూ వుత్సాహపడిన సునీత, కొంత వరకు వుద్రేకపడిన సునీతకి వొంటికి మనసు ఎదురు తిరిగింది. మరి కాస్సేపటికి నెమ్మదిగా లేచి ఆ ఎర్రచీరని విప్పేసి జాగ్రత్తగా మడతపెట్టి, ఆ వుత్తరంతో సహా తిరిగి పేక్‌చేసింది సునీత.

ఈ సారీ చిరాగ్గానే అనిపించింది సునీతకి. అయినా మనసులో లోపల ఏదో తృప్తిగానే వుంది.

